క్లుప్తంగా

ఎంఎల్ఎస్ స్టాక్ గోదాం తనిఖీ



వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని జీసీసీ ఎంఎల్ఎస్ స్టాక్ గోదామును జిల్లా కలెక్టర్, సివిల్ సప్లై అధికారుల ఆదేశాల మేరకు శనివారం తహసీల్దార్ లక్ష్మిరాజయ్య తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్టాక్ పాయింట్ రికార్డులను, స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. గోదాములో ఎన్ని బస్తాల బియ్యం నిల్వ ఉన్నది, ఎన్ని బస్తాలు సప్లై చేశారు అనే విషయాలను పరిశీలించారు. తనిఖీ నివేదికను జిల్లా ఉన్నతాధికారులకుఅందజేయనున్నట్లు ఆయన తెలిపారు.

సాయిబాబా జయంతి వేడుకలు



వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని పెట్రోల్‌బంక్ సమీపంలోని సాయిబాబా ఆలయంలో శనివారం సాయిబాబా జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అభిషేకాలు, కాకడ హారతి, ఊరేగింపు సేవా తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు



వెంకటాపురం(కె): మండల పరిషత్ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో పంపు ఆపరేటర్లకు నాలుగు రోజులు శిక్షణ తరగతులను నిర్వహించారు. కాగా శనివారం పంపు ఆపరేటర్లు మంచినీటి నాణ్యత పరిశీలనపై శిక్షణ ఇచ్చారు. అనంతరం శిక్షణ పొందిన ఆపరేటర్లకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఇంట్రా ఈఈ సుభాష్, డీఈ వెంకటేష్, ఏఈ శ్రీనివాస్, ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్, ఎంపీఓ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గుర్రం జాషువా జయంతి వేడుకలు



ములుగు రూరల్ : గుర్రం జాషువా 129వ జయంతి వేడుకలను కుల వివక్షత పోరాట సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శనివారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో కేవీపీఎస్ మండల కార్యదర్శి జన్ను దేవేందర్ ఆధ్వర్యంలో జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ములుగు ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల వివక్షత, అంటరానితనం రూపుమాపేందుకు పోరాటం చేసిన మహోన్నత వ్యక్తి గుర్రం జాషువా అని కొనియాడారు. కార్యక్రమంలో రాజేందర్, నిరంజన్, వసంత్, భిక్షపతి తదితరులు పాల్గన్నారు.

మొక్కలు నాటిన విద్యార్థులు



మంగపేట : మండల కేంద్రంలోని ఎక్కటి సరోజిని, శేషారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళా శాల ప్రిన్సిపాల్ నాయిని వీరేందర్ ఆధ్వర్యంలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా కాలేజీ విద్యార్థులు శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వీరేందర్ విద్యార్థులకు మానవాళికి ప్రాణవాయువును అందించే చెట్ల ప్రాముఖ్యతపై అగాహన కల్పించారు. మొక్కలు నాటడం వాటిని సంరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అనంతరం కళాశాల అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి కాలేజీ నుంచి ప్రధాన రోడ్డుకు ఇరువైపుల వివిధ రకాల మొక్కలను నాటారు.

ప్రభుత్వ ప్రకటనపై హర్షం

వాజేడు : విధుల్లో ఉన్న ఉద్యోగులపై దాడులు చేస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం ప్రకటించడంతో ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు ఇర్ప బాలాజీ హర్షం వ్యక్తం చేశారు. జీఓ నంబర్ 25ను తక్షణమే సవరించాలని కోరారు. డీఏ, పీఆర్‌సీలపై ప్రభుత్వం స్పందించాలన్నారు.

గోదావరి ఒడ్డుకు రక్షణ కరువు

- ఒర్లిపోతున్న ఒడ్డు.. జనావాసాలకు చేరువలో..
- భయభ్రాంతులతో ప్రజలు



ఏటూరునాగారం : జనావాసాలకు ఆనుకొని ప్రవహిస్తున్న గోదావరి ఒడ్డు రోజురోజుకు ఒర్లిపోతుంది. ప్రజలు కట్టుకున్న ఇళ్లకు ప్రమాదం ఉందని భయాందోళన చెందుతున్నారు. వాగు ఉప్పొంగడంతో ఏ క్షణంలో ఏం జరుగుతుందని వణికిపోతున్నారు. గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న 24 వేల జనాభా కలిగి ఉండడంతో రక్షణగా కట్టించిన కరకట్టకు ప్రమాదం పొంచి ఉంది. దీంతో ప్రజలకు రక్షణ లేదని ఆందోళన చెందుతున్నారు.

వర్షాకాలం వస్తే వణుకే

వర్షాలతో జంపన్నవాగు ఉప్పొంగడంతో ఎప్పుడు ఏ ప్రళయం వస్తుందోనని ప్రజలు కంటిమీద కునుకులేకుండా పోతుంది. కరకట్ట ఉన్నప్పటికీ వాగుకు ఒడ్డు తరిగిపోతుంది. దానివల్ల లక్షలాది రూపాయలతో నిర్మించిన కరకట్టకు ప్రమాదం పొంచి ఉందని స్థానికులు వాపోతున్నారు.

దృష్టి పెట్టని అధికారులు



గ్రామంలోని ప్రజల సంరక్షణపై ఇరిగేషన్‌శాఖ అధికారులు దృష్టి పెట్టడం లేదు. ప్రతీ ఏడాది వాగు ఉప్పొంగినప్పుడు లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాల్సి వస్తోంది. ప్రతి వర్షాకాలం దినదినగండంగా గడుపుతున్నాం. – జి. సత్యం, ఓడవాడ ఏటూరునాగారం

పంటలు కోల్పోతున్నాం



జంపన్నవాగు ఒడ్డువెంట ఉన్న మిర్చి, వరి పంటల భూములు వాగు వల్ల కోల్పోతున్నాం. వాగుల వల్ల విలువైన భూములు వాగునీటిలో కలిసిపోతున్నాయి. వాగుకు రక్షణ కరకట్ట పటిష్ఠంగా మరింత నిర్మించాలి.
– బందారి రంజిత్ , రైతు ఏటూరునాగారం

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



చిన్నారిని పరీక్షిస్తున్న వైద్యాధికారి చిరంజీవి

ఎస్ఎస్‌తాడ్వాయి : సంపూర్ణ ఆరోగ్యం కోసం పోషకాహారం తీసుకోవాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి అడెపు చిరంజీవి అన్నారు. శనివారం ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు బరు వు, ఎత్తు పరీక్షలు నిర్వహించారు. బరువు తక్కువగా ఉన్న చిన్నారులకు వైద్యాధికారి చిరంజీవి వైద్య పరీక్షలు చేసి అవసరమైన పౌష్టికాహారం అందించాలని సూచించారు. ఈసందర్భంగా తల్లులకు పౌష్టికాహారం అవగాహన కల్పించారు. బరువు తక్కువగా ఉండడంతో చిన్నారులకు వచ్చే ఆరోగ్య సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయ, పోషణ అభియాన్ కోర్డినేటర్ శావాణి, అంగన్‌వాడీ టీచర్లు ఇర్ప రజిత, ఈసం ఆదిలక్ష్మీ, జమునారాణి, రుక్మిణి పాల్గొన్నారు.

పిచ్చికుక్క దాడిలో ఒకరికి గాయాలు



వాజేడు : పిచ్చికుక్క దాడిలో ఒకరికి గాయమైన సంఘటన మండలంలోని జగన్నాథపురంలో శని వారం చోటు చేసుకుంది. మండలంలోని ప్రగళ్లపల్లి గ్రామానికి చెందిన ఖాసీం పనిమీద జగన్నాథపురం గ్రామానికి వచ్చాడు. ఆ సమయంలో పిచ్చికుక్క అతనిపై దాడి చేసి గాయపర్చింది. జగన్నాథపురం గ్రామానికి చెందిన మరో ముగ్గురు మహిళలపై దాడికి యత్నించగా వారు తప్పించుకున్నట్లు స్థానికులు తెలిపారు.

రక్తదాన శిబిరం అభినందనీయం



రక్తదానం చేసిన వారిని అభినందిస్తున్న ఇన్‌చార్జ్ తహసీల్దార్ మల్లేశ్వర్‌రావు

మంగపేట: సమాజానికి ఉపయోగపడే విధంగా రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమని ఇన్‌చార్జ్ తహసీల్దార్ మల్లేశ్వర్‌రావు అన్నారు. మండలంలోని కమలాపురంలో జ్వాలా చారిటబుల్ ట్రస్ట్, జన విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదాన శిబిరంలో రక్తదానం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన వారిందరినీ అభినందించారు. ప్రజలకు ఉపయోగపడే ఇలాంటి కార్యక్రమాలు ముస్ముందు మరెన్నో కార్యక్రమాలు నిర్వహించాలని ట్రస్ట్ చైర్మన్ కోడెల నరేష్, కార్యదర్శి రాకేష్‌ను అభినందించారు. రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామని సమాచారం ఇవ్వగానే స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన 50 మందికి జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం



ఏటూరునాగారం: సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ఐటీడీఏ ఏటీడీఓ దేశిరాం, మాజీ కో ఆప్షన్ సభ్యురాలు వలియాబీ అన్నారు. మండలంలోని రామన్నగూడెం జడ్పీహెచ్‌ఎస్‌లో సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న బందారి రాజమౌళి శనివారం ఉద్యోగ విరమణ చేపట్టారు. ఎంఈఓ కొయ్యడ మల్లయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథులుగా దేశిరాం, వలియాబీలు హాజరై మాట్లాడారు. రాజమౌళి 34 ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో రాణించి జిల్లా, మండల స్థాయిలో ఎన్నో ఉత్తమ అవార్డులు అందుకున్నారని తెలిపారు. అనంతరం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సర్వర్ అహ్మద్, కోరగట్ల రవీందర్, కొయ్యడ సురేందర్, ఏళ్ల మధుసూదన్, పోదెం సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన



గిరిజన భవన్ వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయ సంఘాల జేఏసీ నేతలు

ములుగు రూరల్: మండలంలోని బండారుపల్లి గిరిజన భవన్ వద్ద యువజన క్రీడలశాఖ ఆధ్వర్యంలో యువజనోత్సవ కార్యక్రమం నిర్వహించగా ఉపాధ్యాయుల సర్దుబాటు ఉత్తర్వులను ప్రభుత్వం సవరించాలని ములుగు జిల్లా ఉపాధ్యాయ సంఘాల జేఏసీ నాయకులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలపడం చర్చనీయాంశంగా మారింది. ఈ మేరకు శనివారం యువజనోత్సవాల ముగింపు కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర హాజరైన కార్యక్రమంలో ఉపాధ్యాయులు పలు పాఠశాలల నుంచి ఉపాధ్యాయులు సాంస్కృతిక, సైన్స్ మేళా కోసం తీసుకువచ్చారు. ఈ క్రమంలో యువజనోత్సవాల వద్ద ఉపాధ్యాయులు శిరుప సతీష్, కొండ్లె కృష్ణమూర్తి, మహ్మద్ ఫిరోజ్, గన్‌రెడ్డి ఆదిరెడ్డి, గండు కుమార్, అనిత, మహ్మద్ హమీద్, రవి, బల్గూరి వేణు, బండారి జగదీశ్ పాల్గొన్నారు.

హృదయాన్ని పదిలంగా ఉంచుకోవాలి



వాజేడు: డాక్టర్ మహేందర్‌కు వైద్యపరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది



మంగపేట: ఆశ కార్యకర్తలు, స్టాఫ్‌కు షుగర్ పరీక్షలు చేస్తున్న ఏఎన్ఎం

వాజేడు: మానవాళికి అతి ముఖ్యమైన శరీర భాగం హృదయం అని దానిని పదిలంగా ఉంచుకోవాలని వాజేడు వైద్యాధికారి కొమరం మహేందర్ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ప్రపంచ హృదయ దినోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆస్పత్రి సిబ్బంది, ఆశ వర్కర్లకు పలు రకాల పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పునరుజ్జీవన ప్రక్రియ ద్వారా ఆగిన గుండెను స్పందింపజేయడంపై అవగాహన కల్పించారు. ఎక్కువగా ఆకు కూరలను తినాలని, ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉండాలని తెలిపారు. ఇలా చేయడం వలన మనం, మన కుటుంబం, సమాజం ఆరోగ్యంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిని గ్యానస, వెంకటరమణ, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు ఉన్నారు.

మంగపేటలో..

మంగపేట: మండలంలోని చుంచుపల్లి పీహెచ్‌సీలో వైద్యాధికారి యమున ఆధ్వర్యంలో ప్రపంచ హృదయ దినోత్సవం (వరల్డ్ హార్ట్‌డే) కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ పరిధిలోని ఆశా కార్యకర్తలు, ఏఎఎన్ఎం, పీహెచ్‌సీ స్టాఫ్‌కు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ శైలజ, ఏఎన్ఎం సీతమ్మ, సారమ్మ, భాగ్యలక్ష్మి, ఫార్మసిస్ట్ సంధ్య ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి పరీక్షలు



వెంకటాపురం(కె): వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు

వెంకటాపురం(కె): మండల పరిధిలోని ఎదిర వైద్యశాలలో శనివారం ప్రపంచ హార్ట్ దినోత్సవం సందర్భంగా వైద్య సిబ్బందికి వైద్యాధికారులు వైద్యపరీక్షలను నిర్వహించి రక్త నమూనాలను సేకరించారు. అనంతరం సిబ్బందికి హార్ట్ సమస్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు స్నేహ, ఆశీష్, వినయ్, సిబ్బంది మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

'పది'లో నూరుశాతం ఉత్తీర్ణత పొందాలి



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న బ్లడ్ డోనర్స్

ఏటూరునాగారం: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థినులు నూటికి నూరుశాతం మార్కులు తెచ్చుకోవాలని సాయిబాబా దేవాలయం చైర్మన్ ప్రభాకర్, బ్లడ్ డోనర్స్ గౌరవ సలహాదారుడు ఖాజాపాషా తెలిపారు. శనివారం కేజీబీవీ పాఠశాలలోని పేద విద్యార్థిని పూస పల్లవికి బ్లడ్ డోనర్స్ గౌరవ సభ్యులు బెల్లం శ్రీనివాస్ సహకారంతో సైకిల్ అందించినట్లు వారు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులకు పదో తరగతిలో ఎక్కువ మార్కులు తెచ్చుకున్న ఇద్దరు విద్యార్థులకు బహుమతి అందచేస్తామన్నారు. పేదవాడి జీవితాన్ని మార్చేది కేవలం చదువు మాత్రమే అని, చదువు మీద ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. కార్యక్రమంలో బ్లడ్ డోనర్స్ మహమ్మద్ మున్నా, మల్యాల పవన్ చామర్తి కిషోర్, రాజేందర్, రోకేష్, రెడ్డి రామ్, కీలకత్తుల ప్రశాంత్, కేజీబీవీ ప్రత్యేక అధికారి మడే అరుణ తదితరులు పాల్గొన్నారు.

బాలలు వాహనాలు నడిపితే చర్యలు

మంగపేట: బాలలు వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై టీవీఆర్ సూరి హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డ్రైవింగ్, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన లేనటు వంటి బాలలు అతివేగంగా వాహనాలు నడపడం, ట్రాఫిక్ నిబంధనలు పాటించక పోవడంతో తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. మండలంలో ఎక్కడైనా బాలలు ద్విచక్రవాహనం నడుపుతూ పట్టు బడితే వాహనాన్ని సీజ్ సేసి వాహనం ఇచ్చిన వారిపై కేసు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు. ఈనెల 5 నుంచి బతుకమ్మ, దసరా పండుగ సందర్భంగా పాఠశాలలు, కాలేజీల నుంచి ఇంటికి వచ్చే వారితో పాటు స్థానికంగా ఉండే వారికి వారి తల్లిదండ్రులు వారి పిల్లలకు డ్రైవింగ్ లైసెన్సు లేని వారికి బైక్‌లు ఇవ్వొద్దని సూచించారు. తరచూ గ్రామాల్లో కొందరు యువకులు, బాలలు డ్రైవింగ్ లైసెన్సులు లేని వ్యక్తులు ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ పట్టు బడుతున్నారన్నారు.

అటవీశాఖ అధికారులకు రక్షణ కల్పించాలి



వాజేడు : మాట్లాడుతున్న నాగరాజు

వాజేడు: వలస గిరిజనేతరులు అటవీ శాఖ సిబ్బందిపై దాడి చేసిన ఘటనతో ఆదివాసీలు భయాందోళనకు గురవుతున్నారని నవ నిర్మాణ సేన మండల అధ్యక్షుడు మొడెం నాగరాజు అన్నారు. మండలంలోని ఇప్పగూడెంలో శనివారం కారం నరేందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. తాడ్వాయి మండల పరిధిలోని దామరవాయి వద్ద అడవిని యంత్రాలతో తొలగిస్తుంటే అడ్డుకున్న అటవీశాఖ ఉద్యోగులపై దాడి చేసిన గిరిజనేతర వ్యక్తులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విధులు నిర్వహిస్తున్న వారిపై దాడి చేసి గాయపర్చిన వారిలో ఆదివాసీ ఉద్యోగి కూడా ఉన్నాడని అతనికి ప్రభుత్వమే వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. దాడికి పాల్పడిన వారిని చట్ట పరంగా కఠినంగా శిక్షించాలని కోరారు. సమావేశంలో కొర్స సంపత్, చందు, మొడెం శివ, పర్శిక రాజేందర్ ఉన్నారు.

దాడిచేసిన వారిని శిక్షించాలి

మంగపేట: తాడ్వాయి మండలంలోని దామెరవాయి అటవీ ప్రాంతంలో ఈనెల 26న విధి నిర్వహణలో ఉన్న అటవీశాఖ అధికారులపై విచక్షణా రహితంగా దాడిచేసి గాయపరిచిన వ్యక్తులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని తుడుందెబ్బ మండల అధక్షుడు దబ్బుల ముత్యాలరావు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో భాగంగా అడవిలో చెట్లను ధ్వంసం చేస్తున్న జేసీబీని స్వాధీనం చేసుకుని రేంజ్ కార్యాలయానికి తరలిస్తున్న క్రమంలో ఎఫ్ఎస్ఓ వినోద్, బీటాఫీసర్ శరత్‌పై దాడి చేసి హతమార్చేందుకు ప్రయత్నించారని ఆయన ఆరోపించారు. పథకం ప్రకారంగా అడవిపైన అడవిని కాపాడే ఆదివాసీ ఉద్యోగుల పైన దాడులకు పూనుకుంటున్నారని అలాంటి వారు వారి పద్ధతి మార్చుకోవాలని లేనిపక్షంలో ఆదివాసీల చేతిలో వారికి తగిన గుణపాఠం తప్పదని ఆయన హెచ్చరించారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, లెక్చరర్లు

ఏటూరునాగారం: సమాజంలోని ప్రజలు, విద్యార్థులు పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ నవీన్ అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మనం వెల్ఫేర్ సొసైటీ వారి సహకార ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా వారోత్సవాల్లో భాగంగా పర్యావరణ పరిరక్షణ పచ్చదనంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం నవీన్ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటయోధుడు భగత్ సింగ్, కవి గుర్రంజాషువాల జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించామన్నారు. ప్లాస్టిక్‌ను నివారించాలని, పర్యావరణ రక్షణ, పచ్చదనం– స్వచ్ఛదనం వంటి రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. నీటి నిల్వలను కాపాడుకోవాలని కోరారు. కోఆర్డినేటర్ వెంకటయ్య, మనం వెల్ఫేర్ బాధ్యులు శ్రీనివాస్, జ్యోతి, ఫా తిమా, సంపత్, రమేష్, సుమలత, శేఖర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



నోట్‌బుక్స్ అందస్తున్న ఎంఈఓ శ్రీనివాసులు, ఎంపీడీఓ రామకృష్ణ

ములుగు రూరల్ : జిల్లా కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు డీఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ మేరకు శనివారం ట్రస్ట్ చైర్మన్ దొడ్డా ప్రతాప్‌రెడ్డి నిరుపేద విద్యార్థులకు చేయూతనందించగా ఎంఈఓ శ్రీనివాసులు, ఎంపీడీఓ రామకృష్ణ ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు నోట్‌బుక్స్ అందించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులకు రూ.10 వేల విలుగల బుక్స్ అందించిన ట్రస్ట్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం రాజేందర్, పాఠశాల హెచ్ఎం ఉమాదేవి, ఉపాధ్యాయులు రాజు, సాంబయ్య, శ్రీనివాస్‌రెడ్డి, సంపత్, ముకుందరెడ్డి, అపర్ణ, లత, స్వాతి, సీఆర్‌పీ భాస్కర్‌రెడ్డి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



మంగపేట: అక్కమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యూత్ కాంగ్రెస్ నేత సూర్య



గోవిందరావుపేట: సారయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ జిల్లా నాయకులు

మంగపేట : మండలంలోని కమలాపురంలో నిర్వహించిన చింతా అక్కమ్మ సంవత్సరీకం కార్యక్రమానికి మంత్రి సీతక్క తనయుడు, రాష్ట్ర యూత్‌కాంగ్రెస్ సెక్రటరీ సూర్య శనివారం హాజరయ్యారు. ఈ సందర్భంగా అక్కమ్మ చిత్ర పటం వద్ద పూలు సమర్పించి ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ నివాళులర్పించారు. అనంతరం అక్కమ్మ కుమారులు కాంగ్రెస్ ఉమ్మడి జిల్లా సీనియర్ నాయకులు చింతా పరమాత్మ, పున్నారావు, శ్రీనివాస్, గోపాలకృష్ణ, సంపత్‌రావు, వెంకటలింగయ్య వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల అధక్షుడు జయరాంరెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు గుమ్మడి సోమయ్య, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష అభ్యర్థి ఎండి ఇస్సార్‌ఖాన్, యూత్ కాంగ్రెస్ మండల అధక్షుడు మురుకుట్ల నరెందర్, జిల్లా సీనియర్ నాయకులు రాధాకృష్ణ, గౌతమ్‌కుమార్, శివప్రసాద్, రాంచందర్‌రావు, రాఘవరెడ్డి, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ కర్రి నాగేంద్రబాబు తదితర నాయకులు ఉన్నారు.

డీపీఓను పరామర్శించిన జిల్లా నాయకులు

గోవిందరావుపేట: ములుగు జిల్లా డీపీఓ దేవరాజ్ తండ్రి ఒంటేరు సారయ్య ఇటీవల మరణించగా వారి కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా నాయకులు శనివారం పరామర్శించారు. ఐఎన్‌టీయూసీ ములుగు జిల్లా అధ్యక్షులు కొంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మండల యూత్ అధ్యక్షుడు చింత క్రాంతి, పార్టీ సీనియర్ నాయకులు గుండెబోయిన అనిల్ యాదవ్ పరకాలలోని ఆయన స్వగృహంలో పరామర్శించారు. అనంతరం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

మండలంలోని మచ్చాపూర్‌కు చెందిన దళిత ఉద్యమకారుడు ఊట్ల మోహన్ అనారోగ్యంతో బాధపడుతున్నందున రాష్ట్ర దళితబంధు కోఆర్డినేటర్ మడికొండ రమేశ్ శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులకు దళితబంధు ఐక్య పోరాట సమితి ఎల్లవేళలా అండగా ఉంటుందని అన్నారు. ఆయన వెంట దర్శనాల సంజీవ, తిరుపతి, విజయ్, వెంకన్న, శ్యామ్ తదితరులు ఉన్నారు.

కుల సంఘం భవనానికి భూమి పూజ

గోవిందరావుపేట : మండలంలోని చల్వాయి గ్రామంలో శనివారం గోసంగి కుల సంఘం భవనానికి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ శనివారం కొబ్బరికాయ కొట్టి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు చల్వాయిలోని గోసంగి కుల సంఘానికి కమ్యూనిటీ భవనం నిర్మిస్తానని ఇచ్చిన మాట ప్రకారం మంత్రి సీతక్క భవనాన్ని మంజూరు చేశారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం సంఘ భవనం మంజూరు చేసిన సీతక్కకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పైడాకుల కృష్ణమూర్తి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి తేళ్ల హరిప్రసాద్, మాజీ ఎంపీటీసీలు గుండెబోయిన నాగలక్ష్మీ అనిల్ యాదవ్, చాపల ఉమాదేవి నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు వేల్పుగొండ ప్రకాష్, నర్సయ్య, పూర్ణచందర్, గోసంగి కుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.